# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర బడ్జెట్‌పై శాసనసభ్యులకు అవగాహన సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నిర్వహిస్తోంది.**
2. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 2024 ఏడాదికిగానూ 'స్కోచ్' పురస్కారానికి ఎంపికైంది.**
3. **రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ పరీక్షల రుసుము చెల్లింపు గడువును ఇంటర్మీడియట్ విద్యామండలి ఈనెల 21వరకు పొడిగించింది.**
4. **ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలును నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు.**
5. **ఈరోజు ప్రపంచ న్యుమోనియా నివారణా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

రాష్ట్ర బడ్జెట్‌పై శాసనసభ్యులకు ఈరోజు అవగాహన సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అమరావతిలోని రాష్ట్ర శాసనసభ కమిటీ సమావేశ మందిరంలో జరుగుతున్న ఈ సదస్సులో శాసనసభాపతి సి. హెచ్ అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పార్లమెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో తొలిసారి శాసనసభకు ఎన్నికైన 84 మంది, రెండోసారి ఎన్నికైన 39 మంది సభ్యులకు ఈరోజు సభలో బడ్జెట్ ప్రవేశపెట్టడం నుంచి ఆమోదించే వరకు ఉన్న ప్రక్రియలపై అవగాహన కల్పిస్తున్నారు. సదస్సు అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో శాసన సభ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలు, శాసనసభ నిర్వహణ వంటి అంశాలపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –ఏపీఎస్ఆర్టీసీ 2024 ఏడాదికిగానూ 'స్కోచ్' పురస్కారానికి ఎంపికైంది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీ, బస్సుల్లో డిజిటల్ టికెట్ల చెల్లింపులు చేస్తున్నందుకు గానూ, బస్సుల్లో ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు ఆర్టీసీ ఈ పురస్కారానికి ఎంపిక అయింది. ఆర్టీసీ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ, ఐటీ చీఫ్ ఇంజినీర్ వి.సుధాకర్ ఈ అవార్డును అందుకున్నారు. దీనిపై రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఆర్టీసీ ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

-------------------------

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు పట్టణంలో నిర్మించనున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతి లభించిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఒంగోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.... రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రధానమంత్రి గతి శక్తి యోజన పథకం కింద నిర్మించనున్నామని తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎంపీ తెలుపుతూ,

వాయిస్ ( 33 సెకన్లు)

---------------------------

సాహిత్యకారులు, సంఘ సంస్కర్త కనకదాసు జయంతిని ఈ నెల 18న రాష్ట్ర పండగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. తన కీర్తనలు, సాహిత్యంతో సమాజ అసమానతలపై రచనలు చేసిన సాహిత్యకారులు గురు కనకదాసు అని అన్నారు. కర్నాటకలో జన్మించిన కనకదాసు... రాయలసీమలో కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని, అటువంటి మహానీయుని జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లోనూ కనకదాసు జయంతి నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల రుసుము చెల్లింపు గడువును ఈనెల 21 వరకు పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతిక శుక్లా ఆదేశాలు జారీ చేశారు. అపరాధ రుసుము వెయ్యి రూపాయలతో డిసెంబరు 5 వరకు చెల్లించే అవకాశం కల్పించారు. పరీక్షలు మార్చి 1 నుంచి, ఫిబ్రవరి రెండోవారంలో ప్రాక్టికల్స్, నైతికత, మానవ విలువలు, పర్యావరణం పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలును నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు రేపు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం సికింద్రాబాద్ చేరుకుంటుందని చెప్పారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుందని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

---------------------------

మాదకద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరమని యువత వాటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలపై ఒకరోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి ఎస్పీ ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యపై విద్యార్థులు దృష్టి సారించాలని ఆయన పేర్కొంటూ,

వాయిస్ …32 సెకన్లు

---------------------------

ఈరోజు ప్రపంచ న్యుమోనియా నివారణా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. వైరస్, బ్యాక్టీరియాలు ఊపిరితిత్తుల్లో చేరి శ్వాస వ్యవస్థను ప్రభావితం చేసే న్యుమోనియా వ్యాధిని ముందస్తు చికిత్స ద్వారా నివారించవచ్చని, టీకా కూడా అందుబాటులో ఉందని అవగాహన కల్పిస్తూ 2009వ సంవత్సరం నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతీ ఏటా నవంబర్ 12వ తేదీన ప్రపంచ న్యుమోనియా నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

---------------------------

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధులు నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ వైద్య అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తున్న ఆమె ఈరోజు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాలను సందర్శించి రోగులకు, బాలలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ… జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు కల్పించి, మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఇందుకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ……

…..వాయిస్…. 35 సెకన్లు….

---------------------------

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి. వెంకట అప్పారావు హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా పలాస డిఎస్పీ కార్యాలయంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, దొంగతనాలు, ఇసుక, మద్యం అక్రమ రవాణాకు పాల్పపడే వారిపై నిఘా ఉంచామనితెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, అతివేగంతో వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

=====================